ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 3 నవంబరు 2025



చిలుకూరు ఆలయంలో సతీశన్ నంబుదరీపాత్, రంగరాజన్

అనంతపద్మనాభ స్వామి ఆలయ తంత్రి
చిలుకూరు సందర్శన

మొయినాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : తిరువనంతపురంలోని శ్రీ అనంతపద్మనాభస్వామి దేవాలయ ప్రధాన తంత్రి సతీశన్‌నంబుదరీపాత్ తన శిష్యులతో కలిసి ఆదివారం చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను వారికి వివరించారు అనంతరం మాట్లాడుతూ సమాజంలో శాంతి, ఐక్యత, సమానత్వం నెలకొనాలని ప్రార్థించారు. 1936 నవంబరు 12న తివేంద్రం మహారాజు శ్రీ చిత్తర తిరుమాళ్ బలరామవర్మ జారీచేసిన చారిత్రాత్మక దేవాలయ ప్రవేశ ప్రకటనను స్మరిస్తూ ఆ రోజును జాతీయ దేవాలయ ప్రవేశ దినంగా ప్రకటించాలనే ప్రయత్నాన్ని హర్షించారు.

39 ఫామ్ హౌస్‌ల్లో పోలీసుల
ఆకస్మిక తనిఖీలు



పట్టుబడిన మద్యం బాటిళ్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లోని ఫామ్ హౌస్‌లలో సైబరాబాద్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం రాత్రి రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని చేవెళ్ల, మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న ఫామ్ హౌస్‌లను ప్రత్యేక పోలీసు బృందాలు తనిఖీ చేపట్టారని డీసీపీ యోగేష్ గౌతం తెలిపారు. తనిఖీల్లో భాగంగా తోలుకట్ట గ్రామ పరిధిలోని అజీముద్దీన్ ఫామ్ హౌస్‌లో హుక్కా సేవిస్తుండగా పట్టుకున్నామని, అదేవిధంగా ప్రణవ విల్లా హిల్స్‌లో ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా మద్యం సేవిస్తుండగా 18 బీర్లు బాటిళ్లు, ఫుల్ విస్కీ బాటిల్‌ను గుర్తించామని తెలిపారు. అనుమతులు లేకుండా టిక్కెట్లతో ఈవెంట్ నిర్వహించడంతో పాటు సౌండ్ బాక్సులు, బాణాసంచా కాల్చారు. పలువురు మద్యం సేవించారని, అక్కడి నుంచి విస్కీ, రమ్, వైన్, బ్రీజర్స్‌ను గుర్తించామని డీసీపీ తెలిపారు. పలువురికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ ఎవరికి రాలేదు. ముడిమ్యాల విలేజ్ దగ్గర తనిఖీల్లో హుక్కాను గుర్తించగా, రితికా ఫామ్ హౌస్‌లో స్లేట్ స్కూల్ పిల్లలతో అనుమతి లేకుండా ఈవెంట్‌ను నిర్వహించారని, అక్కడ కొంత మంది ఆల్కాహాలును తీసుకున్నట్లు గుర్తించామని తెలిపారు. ఫామ్ హౌస్‌ల తనిఖీతో పాటు తోలుకట్ట వద్ద 2 బృందాలతో వాహనాల తనిఖీలు చేపట్టామని, 3 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రూ.30వేల జరిమానాలు వసూలు చేశామని డీసీపీ యోగేష్ గౌతం వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఫామ్ హౌస్ యజమానులపై 4 కేసులు చేశామని తెలిపారు.

ఇబ్రహీంపట్నం - ఆక్టోపస్ రోడ్డు విస్తరణకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. విద్యుత్ లైన్లు, మిషన్ భగీరథ పైప్‌లైన్లు రోడ్డు మధ్యన ఉండటంతో వీటిని మార్చేందుకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాల తొలగింపు కూడా పెద్ద సవాల్‌గా మారింది. రోడ్డు విస్తరణకు ఇళ్ల తొలగింపు కూడా పెద్ద ఇబ్బందిగా మారింది. ఈ సమస్యలను పరిష్కరిస్తే తప్ప రోడ్డు విస్తరణ పనులు ముందుకుసాగే పరిస్థితి లేదు.

అడుగడుగునా
అడ్డంకులు

ముందుకు సాగని ఇబ్రహీంపట్నం- ఆక్టోపస్ రోడ్డు విస్తరణ పనులు

» దారి మధ్యలో విద్యుత్ స్తంభాలు, మిషన్ భగీరథ పైపు లైన్లు » ఐదు కిలోమీటర్లు.. రూ.45 కోట్లు వ్యయం

ఇబ్రహీంపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ నుంచి నాగన్‌పల్లి వెళ్లే రహదారి ఇది. అలాగే ఎన్‌ఎస్‌జీ, ఆక్టోపస్‌లకు కూడా ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. ఏళ్లతరబడిగా ఈ రహదారి విస్తరణకు నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. గత ప్రభుత్వంలో ప్రణాళికలు వేసినా కొన్ని అనివార్య కారణాలతో పనులు చేపట్టలేకపోయారు. చివరకు హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) నిధులు రూ.45కోట్లు మంజూరు కాగా, టెండర్‌ను దక్కించుకున్న విశ్వ సముద్ర కంపెనీ పనులు చేపట్టింది. అన్నీ సవ్యంగా ఉండటంతో నెలరోజుల వ్యవధిలో రోడ్డు పనులు పూర్తి చేసేందుకు అధునాతన యంత్రాలను దింపింది. ఇబ్రహీంపట్నం చౌరస్తా నుంచి సీహెచ్‌సీ ముందు నుంచి ఆక్టోపస్ వరకు 24.4 మీటర్ల వెడల్పుతో ఐదు కిలోమీటర్లు నాలుగు లేన్లుగా ఈ రహదారిని విస్తరించాలని సంబంధిత అధికారులు నిర్ణయించారు. రోడ్డు మధ్య డివైడర్ కూడా ఏర్పాటు చేయడానికి ప్లాన్ చేశారు. కాగా చౌరస్తా నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణకు ఎలాంటి ఇబ్బందులు లేవు. అక్కడ నుంచి కుమ్మరి బస్తీ, కల్లు కాంపౌండ్ నుంచి టౌన్ చివరివరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లను కొంతమేర తొలగించేందుకు మార్కింగ్ కూడా ఇచ్చారు. నాలుగేళ్ల క్రితమే ఇళ్లు తొలగించే క్రమంలో బస్తీ వాసులు కొందరు అడ్డుపడి కోర్టు నుంచి స్టే తేవడం, కొందరు రాజకీయ నాయకుల

మిగతా 8వ పేజీలో...



ఇబ్రహీంపట్నం - ఆక్టోపస్ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని నచ్చజెప్పినా..

ఈ రోడ్డు విస్తరణలో ఇబ్రహీంపట్నం టౌన్‌లో పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి వినోభానగర్‌లోని భూదాన్ భూముల్లో ఇళ్ల స్థలాలు చూపుతామని నాలుగేళ్ల క్రితమే ఎమ్మెల్యేగా ఉన్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. దీంతో కొందరు సమ్మతిని తెలుపగా.. మరికొందరు రాజకీయం చేయడంతో ఇబ్రహీంపట్నం - ఆక్టోపస్ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. అభివృద్ధి చెందుతున్న మున్సిపాలిటీలో రోడ్డులేక ఈ బస్తీలు కళ తప్పాయి. ఇప్పటికైన బస్తీ వాసులు సహకరిస్తే రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది.

ఇంటి స్థలం.. ఇందిరమ్మ ఇల్లు



ఇబ్రహీంపట్నం- ఆక్టోపస్ రోడ్డు విస్తరణలో పాక్షికంగా, పూర్తిగా ఇళ్లు కోల్పోతున్న వారితో మాట్లాడి సమస్యను సానుకూలంగా పరిష్కరించే దిశగా చూస్తున్నాం. స్థానిక నాయకులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఈ విషయమై సూచన చేశాం. రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోతున్న వారికి రెట్టింపు ఇంటి జాగా, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం. ప్రజలు కూడా సహకరించాలి.

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శేఖర్, బ్రహ్మయ్య, పెంటయ్య

సీఐటీయూ జిల్లా మహాసభలను
విజయవంతం చేయాలి

తలకొండపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శేఖర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, జిల్లా కోశాధికారి పెంటయ్య పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించే మహాసభలు, బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఆదివారం సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ నెల 10, 11వ తేదీల్లో రాజేంద్రనగర్ కాటేదాన్ పారిశ్రామిక వాడలో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దుర్గయ్య, కృష్ణయ్య, పడకల అధ్యక్షుడు సత్తయ్య ప్రధాన కార్యదర్శి రామస్వామి, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య రాజు, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



కృష్ణారెడ్డి రజిత దంపతులను సన్మానిస్తున్న గుత్తా సుఖేందర్ రెడ్డి

విద్యారంగం బలోపేతానికి
మార్పులు అవసరం

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి విద్యా విధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. మాడుగుల మండలంలోని గిరి కొత్తపల్లి గ్రామానికి చెందిన కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇట్టే కృష్ణారెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఎస్‌టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, మాజీ ఎమ్మెల్యే కత్తి నర్సింహారెడ్డి, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, మాజీ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య అనుబంధం పెరగాలని, వృత్తిని ఉపాధ్యాయులు అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. ఉపాధ్యాయ వృత్తికి కృష్ణారెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్సీ దయానంద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. విద్యారంగ బలోపేతానికి మరిన్ని సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లిక్కీ అను, రుద్రారెడ్డి, ఎంఈవో రామారావు, హెచ్‌ఎం నర్సింహ్మ, శంకర్, శృతిలయ కల్చర్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సుధాకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాధాజయలక్ష్మి, శిరీష, విశ్వశాంతి, నీరజ, పాండురంగారెడ్డి, రాంరెడ్డి, నాయకులు గొంది జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సెక్రటరీ పోల్‌రెడ్డి, ఫణికుమార్ రెడ్డి, మానస, సాయికిరణ్‌రెడ్డి, శిరీష, కవిత, సునీత, రాములమ్మ, యాదవరెడ్డి, వనజాత, ప్రమోదిత, సబితా, వికాస్, రాజవర్ధన్‌రెడ్డి, సాయికిషోర్, అభినవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎయిర్‌లైన్స్ విమానంలో
సాంకేతిక లోపం

గోవా వెళ్లాల్సిన ఫ్లైట్ ఆలస్యం
ప్రయాణికుల ఆందోళన



శంషాబాద్‌రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి గోవా వెళ్లాల్సిన ఫ్లై91 ఎయిర్‌లైన్స్ విమానం సాయంత్రం 4.40 గంటలకు టేకాఫ్ తీసుకోవడానికి రన్‌వేపైకి వెళ్లింది. సాంకేతిక లోపం ఉన్నట్లు గుర్తించిన పైలెట్ విమానాన్ని తిరిగి బే నంబర్ 15 వద్ద వచ్చి ఆపాడు. విమానం వెళ్లడం ఆలస్యంపై ఓ ప్రయాణికుడు ఎయిర్‌లైన్స్ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. అక్కడున్న సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది ప్రయాణికుడికి నచ్చజెప్పారు. దాదాపు రెండు గంటల పది నిమిషాల తరువాత విమానానికి మరమ్మతులు పూర్తి కావడంతో తిరిగి రాత్రి 7.50 గంటలకు గోవా బయల్దేరి వెళ్లింది. సమాచారం ఇవ్వడంలో ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమ బదిలీల
కలకలం

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఉన్నతాధికారుల ఆరా

విజిలెన్స్ విచారణకు ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
సమగ్ర విచారణ జరపకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరిక



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : జిల్లాలో 317 జీవో పేరుతో పెద్ద ఎత్తున జరిగిన టీచర్ల అక్రమ బదిలీల వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన ప్రత్యేక కథనం కలకలం రేకెత్తించింది. కొన్నాళ్లుగా జిల్లా విద్యాశాఖ ఇష్టారాజ్యంగా చేస్తున్న బదిలీలు, పదోన్నతులతో స్థానిక ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై అన్ని ఆధారాలతో ఆదివారం ఆంధ్రజ్యోతి 'స్పౌజ్ కోటా.. అందరికీ వాటా' అనే శీర్షికన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై ఉపాధ్యాయవర్గాల్లో ఎక్కడ చూసినా చర్చ జరిగింది. స్పౌజ్ కోటా బదిలీలతో పాటు, డిప్యూటేషన్లు, పదోన్నతుల్లో అక్రమాలపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడ్డాయి. ఈ కథనంపై స్పందించిన ఉపాధ్యాయ సంఘాలు అడ్డగోలుగా జిల్లా విద్యాశాఖ చేస్తున్న బదిలీలపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే మరిన్ని ఆధారాలను విచారణాధికారులకు అందచేస్తామని ప్రకటించాయి. ఇదిలాఉంటే కలకలం రేకెత్తించిన ఈ కథనంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. వివరణ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మరోవైపు ఈ కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు వివరణ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశానుసారంగా పారదర్శకంగానే బదిలీలు, పదోన్నతులు చేసినట్లు చెప్పారు. అయితే డీఈవో కార్యాలయం నిబంధనలు పాటించి బదిలీలు, పదోన్నతులు ఇచ్చి ఉంటే వీటి ప్రక్రియకు సంబంధించి సమాచారం హక్కుచట్టం కింద ఉపాధ్యాయ సంఘాలు కోరిన సమాచారం ఇప్పటి వరకు ఇవ్వకపోవడానికి కారణాలు ఏమిటీ..? నాగర్‌కర్నూల్ నుంచి స్పౌజ్ కోటాలో వచ్చిన ఒక ఉపాధ్యాయురాలి బదిలీ తలకొండపల్లికి కాకుండా నగరంలోని సరూర్‌నగర్‌కు ఎలా బదిలీ చేశారు? బడికెళ్లకున్నా ఆమెకు జీతం ఎలా ఇచ్చారు? డీఈవో కార్యాలయంలో

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే.. : డీఈవో

శిథిల భవనం..
భయం భయం!

అధ్వానంగా యాచారం ఉన్నత పాఠశాల



యాచారం ఉన్నత పాఠశాలలో పాడైన కిటికీలు

కూలడానికి సిద్ధంగా తరగతి గదులు
పాడైన తలుపులు, కిటికీలు
పట్టించుకోని పాలకులు, అధికారులు



యాచారం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): యాచారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు శిథిలమయ్యాయి. ఏ క్షణంలో ఏ గది కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 45 ఏళ్ల క్రితం కట్టిన భవనంలోని గదుల్లో కూర్చోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు జంకుతున్నారు. బడిలోని తరగతి గదులు కూలడానికి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. వర్షం కురిసినప్పుడైతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. తరగతి గదుల వైపు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తుంది. శిథిల గదులను కూల్చి కొత్తవాటిని నిర్మించాలని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆనాటి ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అధికారుల దృష్టికి తెచ్చినా ఎవరూ ఆ దిశగా చొరవ చూపలేదు. కాగా ఇటీవల పాఠశాలను సందర్శించిన జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి గదులను చూసి విస్తుపోయారు. పాత గదులను కూల్చాలని తనకు, కలెక్టర్‌కు లేఖ రాసి పంపించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అయినా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కాగా ఇదే భవనంలో రెండు గదులలో మానసిక దివ్యాంగులకు ప్రతీరోజు కౌన్సెలింగ్ కొనసాగుతోంది. పాఠశాల ఇంటర్‌వెల్, ఇతర సమయాలలో విద్యార్థులు శిథిల గదుల్లో ఆటలాడుతుంటారు. ఈ సమయంలో జరగరాని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అదనపు గదులు నిర్మించాలి

పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం రూ. 65లక్షల నిధులు కేటాయించి కొత్త భవనం నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి. తరగతి గదులు శిథిలమవడంతో ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. కొత్త భవనం నిర్మించడానికి ప్రభుత్వ ఉన్నతాధికారులు చొరవ చూపాలి.

ఎన్.సుదర్శన్‌రెడ్డి, యాచారం





ఆగిన పనులు.. తప్పని వెతలు

అసంపూర్తిగా కడ్తాలలో మండల పరిషత్ భవన నిర్మాణం
నిధులు కేటాయించినా రెండేళ్లుగా ముందుకు సాగని పనులు
తొమ్మిదేళ్లుగా అద్దె భవనంలో కార్యాలయ నిర్వహణ

7

ఎకరానికి రూ.65లక్షలు ఇవ్వాలి

● ఎమ్మెల్యేకు విన్నవించిన మొండిగౌరెల్లి రైతులు

6



సదర్ ఉత్సవంలో ముల్లి పావని, సంఘం నాయకులు

ఘనంగా సదర్ ఉత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్, పోచారం మున్సిపాలిటీ కొర్రెములలో సదర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవంలో ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనియాదవ్ పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఎదులాబాద్‌లో జరిగిన సదర్ కార్యక్రమంలో పావని మాట్లాడుతూ సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతను చాటుతాయన్నారు. ఎదులాబాద్ ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సదర్‌లో యాదవ సంఘం యువకులు పెద్ద ఎత్తున దున్నపోతులతో సదర్ సయ్యాట నిర్వహించగా అందరినీ ఆకట్టుకుంది. దున్నపోతుల విన్యాసాలను తిలకించడానికి గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అచ్చన శేఖర్, నాయకులు, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను సంరక్షించుకుందాం

మోమిన్‌పేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు అన్నారు. మండలంలోని ఎన్కతల గ్రామ సమీపంలోని మాదిగ గుట్టపై వెలిసిన రుద్రమైసమ్మ ఆలయాన్ని ఆదివారం సందర్శించారు. అభివృద్ధిలో భాగంగా ఆలయాన్ని తొలగించడం సరైంది కాదన్నారు. పురాతన కాలం నుంచి రుద్రమైసమ్మ అమ్మవారికి రైతులు తమ పొలాల్లో పంటలు పండినప్పుడు మొక్కులు చెల్లించుకునేవారన్నారు. అలాంటి ఆలయాన్ని అభివృద్ధి పనుల పేరుతో తొలగించడం సరైంది కాదన్నారు. ఇందుకు ప్రతీ హిందువు సంతకాల సేకరణ చేపట్టి కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్, ప్రధాన కార్యదర్శి మాధవి, కార్యదర్శి లక్ష్మయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాఘవేందర్, మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.



మైసమ్మ ఆలయాన్ని సందర్శించిన వీహెచ్‌పీ నాయకులు

నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు

● పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి గత ప్రభుత్వం గ్రామాల్లో సేంద్రియఎరువుల తయారీకి నిర్మించిన కంపోస్ట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. పారిశుధ్య నిర్వహణతో పాటు సేంద్రియ ఎరువును సమకూర్చాలని ఒక్కో పంచాయతీకి కంపోస్టు షెడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో షెడ్డుకురూ.2లక్షల40వేలు మంజూరు చేసింది. అయితే గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. మరి కొన్ని గ్రామాల్లో షెడ్డులోని గదుల్లో తడి, పొడి చెత్తను వేసి అలాగే వదిలేశారు. దీంతో షెడ్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం పెరుగుతోంది.



దేవరఫస్లాబాద్‌లో వినియోగంలో లేని కంపోస్ట్ షెడ్డు

అవగాహన లోపం

గ్రామాల్లో పారిశుధ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన లేకపోవడంతోనే కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. అప్పట్లో వీరికి శిక్షణ ఇచ్చినప్పటికీ వర్మీ కంపోస్టు తయారీ పద్ధతి తెలియకపోవడం, పంచాయతీల్లో సరిపడే సిబ్బంది, గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేకపోవడంతోనే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను అక్కడికి చేర్చి గాజు, ఇనుము, ప్లాస్టిక్ లాంటి తదితర పొడి చెత్త వ్యర్థాలను వేరుచేసి గదుల్లో భద్రపర్చాలి. తడి చెత్తను కుండీల్లో వేసి సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలి. వీటి నిర్వహణ బాధ్యత సర్పంచులు చూసుకోవాలి. అయితే మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో ఇవేమీ అమలు కావడంలేదు.

నిర్వహణలో అలసత్వం

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కంపోస్టు షెడ్ల నిర్మాణంతో ప్రజలకు, ప్రభుత్వానికి ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. వీటి నిర్మాణంలో చూపిన శ్రద్ధ నిర్వహణలో చూపకపోవడంతో ఎరువుల తయారీకి అవకాశం ఉన్నా అందిపుచ్చుకోలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి సారిస్తారేమోననే ఆశలు చిగురిస్తున్నాయి. అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎరువుల తయారీకి నోచుకోక మూలనపడ్డాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీల పాలన గడువు ముగియడం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు నోటిఫికేషన్ విడుదలైనా కోర్టు తీర్పు కారణంగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. గ్రామ పంచాయతీల నిర్వాహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టలేక సతమతం అవుతున్న నేపథ్యంలో షెడ్ల నిర్వహణకు నిధులు ఇచ్చేదెవరు, వాటి నిర్వాహణను పట్టించుకునేదెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో ఇప్పుడు వీటి నిర్వాహణపై సందిగ్ధం నెలకొంది. స్థానిక సంస్థల గడువు గడిచినప్పటి నుంచి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి.

ఎరువు తయారీకి చర్యలు తీసుకుంటాం



దౌల్తాబాద్ మండలంలో నిరుపయోగంగా మారిన కంపోస్టు షెడ్లను అందుబాటులోకి తెచ్చి సేంద్రీయ ఎరువు తయారీకి చర్యలు తీసుకుంటాం, ఇప్పటికే సేంద్రియ ఎరువు తయారీపై పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశాం.

- శ్రీనివాస్, దౌల్తాబాద్ ఎంపీడీవో

ప్రజాపాలనలో పేదలకు సొంతిళ్లు

చౌదరిగూడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇల్లు లేని పేదలకు సొంతింటి కల సాకారం అవుతోందని మాజీ సర్పంచ్ లక్ష్మిసుధనర్సింహులు అన్నారు. ఆదివారం పద్మారంలో అర్హులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్లాబ్ పనులను ఆమె ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. గత ప్రభుత్వం కొందరికి, కొన్నిచోట్ల మాత్రమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించిందని. అయితే కాంగ్రెస్ పాలనతో స్థలం ఉన్న పేదలందరికీ ఇంటిని నిర్మించి ఇస్తోందని చెప్పారు. ఇల్లు మంజూరైన వారంతా వెంటనే నిర్మాణాలను ప్రారంభించుకోవాలని, ఎంత త్వరగా పనులు చేపడితే అంత తొందరగా బిల్లు వస్తుందని మాజీ సర్పంచ్ సూచించారు. తమ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, వెంకటేశ్, యాదయ్య, కృష్ణయ్య, బాబయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఇంటి స్లాబు పనులకు పూజచేస్తున్న లక్ష్మీసుధ



డీసీసీ పీఠంపై ఎమ్మెల్యేకు సీఎం ఆఫర్!

● ఆసక్తి చూపని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నుంచి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఆఫర్ వచ్చింది. అయితే సీఎం సొంత జిల్లా కావడంతో ఈ పదవిని ఎమ్మెల్యేలకే కట్టబెడితే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీలో చర్చకు దారితీసింది. ఇంతకుముందు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం వికారాబాద్ నుంచి రెడ్డి సామాజికక వర్గానికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు పోటీ పడుతున్నారు. తాండూరుకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు ఉత్తంచంద్ బీసీ సామాజిక వర్గం నుంచి తనకు వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా ఉత్తంచంద్ పేరును అధిష్ఠానానికి సూచించారు. అయితే పార్టీ అధ్యక్ష పదవి స్వీకరించేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆసక్తి చూపడం లేదు. జిల్లా అధ్యక్ష పదవి స్వీకరిస్తే అధిక సమయం తాండూరుకు కేటాయించలేకపోతామన్న భావనతో మనోహర్‌రెడ్డి ఉన్నారు. ఇప్పటికే మధ్యవర్తి ద్వారా సీఎంకు తెలియజేసినట్లు సమాచారం.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని స్వీకరించే వారు పార్టీలో కనీసం ఐదేళ్ల సభ్యత్వ సీనియారిటీ ఉండాలని నిబంధన ఉంది. శాసన సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి బీఫామ్ దక్కించుకొని ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. ఎమ్మెల్యేలకు ఐదేళ్ల సీనియారిటీ నిబంధన సడలింపు ఉండే అవకాశం కూడా ఉంది. రంగారెడ్డి జిల్లా అధ్యక్ష పదవి రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే వికారాబాద్ జిల్లా అధ్యక్ష పదవి బీసీ సామాజిక వర్గానికి కేటాయించే అవకాశం ఉంది. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన హరివర్ధన్‌రెడ్డి కొనసాగుతున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల తర్వాత కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని అధిష్ఠానం ప్రకటించనుంది. ఇప్పటికే జిల్లాలో పలువురి అభిప్రాయలను సేకరించిన పార్టీ పరిశీలకులు డిల్లీ అధిష్ఠానం ముందు ఉంచారు.

మాలల రణభేరిని విజయవంతం చేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

కొందుర్గు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాలల రణభేరి సభను విజయవంతం చేయాలని రంగారెడ్డిజిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మహేశ్ అన్నారు. ఆదివారం కొందుర్గులో మాల మహానాడు కరపత్రికను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ... మాలలు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ ఉప వర్గీకరణను ప్రభుత్వాలు వీడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ పాయింట్లను సవరించాలన్నారు. నవంబరు 23న జరిగే మాలల రణభేరి సభకు ప్రతి ఒక్కరూ తరలొచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెన్నయ్య, నర్సింహ, వినోద్, శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో సుదర్శనహోమం నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు

లోక కల్యాణం కోసమే సుదర్శన హోమం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురిసి పడిపంటలు బాగాపండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీ మన్నారు రంగనాయకస్వామి ఆలయ ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీమన్నారు రంగనాయకస్వామి ఆలయంలో ఆదివారం సుదర్శనహోమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపించారు. అమ్మవారికి ఒడిబియ్యం గాజులు, పూలు, పండ్లు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి వారిని ప్రతిష్ఠించి సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. లోక కల్యాణం కోసమే ఆలయంలో నెలలో మొదటి ఆదివారం సుదర్శనహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తిరువదండం పోరెత్తి వంశస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.65 లక్షలు ఇవ్వాలి

● ఎమ్మెల్యేకు విన్నవించిన మొండిగౌరెల్లి రైతులు


యాచారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎకరం భూమికి రూ.65లక్షల పరిహారం ఇవ్వాలని మొండిగౌరెల్లి రైతులు ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విన్నవించారు. భూములు పోతే తామంతా వీధిన పడతామని ఎమ్మెల్యేతో వాపోయారు. మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇచ్చి తమకు ఉపాధి చూపాలని రైతులు కోరారు. అయితే అసైన్డ్ భూముల పేరిట పరిహారం కోసం కొందరు బినామీలు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారికి పరిహారం ఇవ్వకుండా నిజమైన రైతులు, పొజిషన్‌లో ఉన్న వారికే పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. వారి సమస్యలను సావధానంగా విన్న మల్‌రెడ్డి నిర్వాసిత రైతులకు మేలు చేస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నదానికంటే మెరుగైన పరిహారం ఇచ్చేలా ప్రభుత్వానికి రైతుల డిమాండ్లపై విన్నవిస్తానని చెప్పారు. పరిహారం విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని చెప్పారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డితో ఫోన్లో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చూడాలని రంగారెడ్డి సూచించారు.




ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి సమస్యలు వివరిస్తున్న రైతులు













సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల స్వామి

సమాజ నిర్మాణంలో బీసీ రిజర్వేషన్లు కీలకం

షాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో బీసీ రిజర్వేషన్లు అనేవి కీలకం అని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకుడు చేవెళ్ల స్వామి అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 22వ రోజుకు చేరాయి. దీక్షలో తమ్మలి సంఘం నాయకులు రవీందర్, రమేష్, నరేందర్, అశోక్, అనంతయ్య, రాము, రవి, గౌతం, పద్మనాభం, శ్రీనివాస్, అనిల్ పాల్గొని బీసీ సంఘం చేపట్టిన దీక్షకు మద్దతు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ శాతాన్ని కొందరు కుట్రతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రాజేందర్‌గౌడ్, నర్సింహులు, రాము, మాజిద్, రాజు, చంద్రయ్య, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

కొండకల్‌లో దేవతామూర్తుల ప్రతిష్ఠాపన



కుంకుమార్చనలో మహిళలు

శంకర్‌పల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకల్ గ్రామంలో నిర్మించిన మల్లన్న, బీరప్ప, కొండపోచమ్మ ఆలయాల్లో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దేవతమూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు నిర్వహించారు. సుమారు 200 మంది మహిళలు కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసిద్ధ గాయకుడు సతీష్ పంతులు ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు, నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కురుమ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిపల్లిలో ఘనంగా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

మొయినాబాద్: నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేతిరెడ్డిపల్లిలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా జరిగింది. అంకర మోని శ్రీనివాస్‌స్వామి కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పడిపూజ, సత్యనారాయణస్వామి వ్రతం ఏర్పాటు చేశారు. శ్రీశైలం గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ చేశారు. సన్నిధాన స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల గదుల ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవాస భారతీయుడు

తలకొండపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):తలకొండపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో దివంగత కొత్త నర్సింహులు, ఈశ్వరమ్మ, కొత్త రామలింగయ్య, కమలమ్మల జ్ఞాపకార్థం రూ.15లక్షలతో వారి కుటుంబ సభ్యులు అదనపు గదులను నిర్మించారు. ఈ పాఠశాలలో చదువుకున్న ఎన్నారైలు వాణిరామకృష్ణ, శివకుమార్, రాఘవేందర్‌లు నిర్మించిన అదనపు గదులను ఆదివారం ప్రారంభించారు. పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ పెరుమాండ్ల లలితమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్మాణ దాతలు, వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తాము ఇదే పాఠశాలలో చదివి అమెరికాలో స్థిరపడ్డామని గుర్తు చేశారు. తాము చదివిన పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే అదనపు క్లాస్ రూంలు నిర్మించామని తెలిపారు. పాఠశాలలోని వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని గొప్పస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మి, నాయకులు మోహన్‌రెడ్డి, జ్యోతి, సురేశ్, టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న ఆలయ ధర్మకర్తలు

కొడంగల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం పురోహితులతో కలిసి ఆలయ ధర్మకర్తలు మిడిదొడ్డి నందారం శ్రీనివాసగుప్తా దంపతులు, తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మాఢ వీధులు, తదితర పనులకు భూమి పూజ చేశారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తదితరులు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారిలో కొంతమంది రెండు రోజులుగా కలెక్టర్ చేతుల మీదుగా పరిహారం చెక్కులు అందుకుంటున్నారు. మిగతావారు సైతం ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఆలయ ధర్మకర్తలు కోరారు. ఈ సందర్భంగా స్వామివారిని మాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మురారి వశిష్ఠ, నందారం రత్నం, పురోహితులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీల కలకలం

(ఐదో పేజీ తరువాయి)

పనిచేసినట్లు ఆన్‌డ్యూటీ సర్టిఫికెట్ డీఈవో సంతకం లేకుండా ఎలా ఇచ్చారు? ఆ తరువాత మళ్లీ డీఈవో ద్వారా ఎలిజిబుల్ ఎలా మంజూరు చేశారు? అలాగే నల్గొండ, ఇతర జిల్లాల నుంచి బదిలీ, డిప్యూటేషన్లపై వచ్చిన వారిని ఏ నిబంధనల ప్రకారం ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు? అనే విషయాలు తేలాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే నిర్ణయాలు : డీఈవో సుశీంద్రరావు

జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలలో జరుగుతున్న అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై డీఈవో సుశీంద్రరావు స్పందించారు. జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల మొత్తం ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగానే చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన 317 ప్రకారమే బదిలీలు చేశామని, ఆప్షన్ల ప్రక్రియ నుంచి పోస్టింగ్ ఆర్డర్‌లను జారీ చేయడం వరకు ప్రతీది పారదర్శకంగా అభ్యర్థుల సమక్షంలో నిర్వహించినట్లు చెప్పారు. కొంతమంది ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారనే దానిలో వాస్తవం లేదన్నారు. ఇలాంటి ప్రచారం వల్ల ఉపాధ్యాయ వర్గంలో తప్పుడు అభిప్రాయం కలుగుతుందని, అన్ని బదిలీలు, పదోన్నతులు కమిషనర్ మరియు పాఠశాల విద్యా డైరెక్టర్ స్పష్టమైన సూచనల మేరకే చేసినట్లు తెలిపారు. బదిలీలను కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా యంత్రాంగం ప్రతి స్థాయిలోనూ పర్యవేక్షించిందన్నారు. జీవిత భాగస్వామి పనిచేసే మండలంలో ఖాళీలు అందుబాటులో లేని సందర్భాల్లో, ఉపాధ్యాయుడి సౌలభ్యం, విద్యార్థుల విద్యా ప్రయోజనాలను కాపాడటానికి పక్కనే ఉన్న మండలాలకు బదిలీలు చేసినట్లు సమర్థించుకున్నారు. పాఠశాల సహాయకుడు, ప్రధానోపాధ్యాయుడు, ఇతర కేటగిరీలకు పదోన్నతులు సీనియారిటీ జాబితాలకు అనుగుణంగా, పారదర్శకంగా చేసినట్లు తెలిపారు.

ఉన్నత స్థాయి విచారణ జరపాలి : టీఎస్‌యూటీఎఫ్

డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి.. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. స్పౌజ్ కోటాలో జరిగిన బదిలీలు, ఇతర పదోన్నతుల విషయంలో జిల్లా విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి బయట జిల్లాల నుంచి అనేక మందిని దొడ్డిదారిన ఇక్కడకు తీసుకువచ్చి పోస్టింగ్‌లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఈ విషయం ఉపాధ్యాయ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఈ వ్యవహారాలను చూస్తే విద్యాశాఖపై ఉన్న నమ్మకం పోయిందన్నారు. పారదర్శకతను పాతరేసి పైరవీలకు డీఈవో కార్యాలయం పెద్దపీట వేసినట్లు స్పష్టమైందన్నారు. వీటిని బట్టి తాము ఏమైనా చేయగలమనే సంకేతాలను జిల్లా విద్యాశాఖ చెప్పకనే చెప్పిందన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని విద్యావ్యవస్థలో క్రమశిక్షణ, న్యాయపరమైన పరిపాలన పునరుద్ధించాలంటే ఈ అక్రమాలపై శాఖపరమైన ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. లేదంటే వీటిపై ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టీఎస్‌యూటీఎఫ్ నేతలు హెచ్చరించారు. అక్రమ బదిలీలు, డిప్యూటేషన్ల వ్యవహారం జిల్లా స్థానిక ఉపాధ్యాయులను తీవ్ర క్షోభకు గురిచేస్తుందని, అనేక మంది టీచర్లు సీనియారిటీ కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని, వీటిపై విచారణ జరపాలని టీఎస్‌టీయూఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్స్ చీఫ్ ఎడిటర్ మాణిక్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అక్రమాల వ్యవహారం సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

విజిలెన్స్ విచారణ జరపాలి

- ఆంధ్రజ్యోతి కథనం అక్షరసత్యం
- సేవ్ టీచర్స్ సంఘం

విద్యాశాఖలో అక్రమ బదిలీలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం అక్షర సత్యమని, ఈ అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరపాలని సేవ్ టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బొడ్డు రవి, ప్రధాన కార్యదర్శి తలారి సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 317 ప్రకారం స్పౌజ్ కోటాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చినందుకు 'ఆంధ్రజ్యోతి' పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఉపాధ్యాయులు, స్థానిక నిరుద్యోగ యువతకు అన్యాయం చేసే విధంగా అక్రమాలకు పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోకుంటే తాము ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వం దీనిపై విచారణ చేపడితే అక్రమాలకు సంబంధించి మరిన్ని ఆధారాలను తాము ఉన్నతాధికారులకు అందించేందుకు సిద్ధమన్నారు. వందలాది మంది స్థానిక టీచర్లకు అన్యాయం చేసిన వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆగిన పనులు.. తప్పని వెతలు



అసౌకర్యాల అద్దె భవనంలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం

- అసంపూర్తిగా కడ్తాలలో మండల పరిషత్ భవన నిర్మాణం
- నిధులు కేటాయించినా రెండేళ్లుగా ముందుకు సాగని పనులు
- తొమ్మిదేళ్లుగా అద్దె భవనంలో కార్యాలయ నిర్వహణ
- ప్రజలకు, అధికారులకు తప్పని ఇబ్బందులు



అసంపూర్తిగా మండల పరిషత్ కార్యాలయ భవనం

కడ్తాల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనుల విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల ఉదాసీనత విమర్శలకు తావిస్తుంది. అసంపూర్తి పనులతో భవన నిర్మాణం పూర్తి కాక ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతుంది. దీంతో ఏళ్ల కాలంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్మాణం పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు.

తొమ్మిదేళ్లుగా తప్పని బాధలు

కడ్తాల మండల పరిషత్ కార్యాలయం అసౌకర్యాల అద్దె భవనంలో కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్ 11న పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటులో భాగంగా కడ్తాలను మండల కేంద్రంగా ఏర్పాటు చేసింది. కాగా మండలానికి ప్రధాన పాలనా కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయానికి తొమ్మిదేళ్లయినా నేటికీ సొంత భవనం లేదు. సొంత భవనం లేని కారణంగా ఏళ్ల కాలంగా జాతీయ రహదారి పక్కన ఓ ప్రైవేట్ భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. కార్యాలయాలనికి అనుగుణంగా లేని భవనంతో ఇటు అధికారులు, పనుల మీద వస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో సమావేశాల నిర్వాహణకు అనువైన హాలు లేక రేకుల షెడ్డులో మండల పరిషత్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న కడ్తాలలో మండల పరిషత్‌కు సొంత భవనం నిర్మించాలని స్థానికులు, నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గల వెంచర్‌లో గ్రామ పంచాయతీ పది శాతం భూమిలో మండల పరిషత్ సొంత భవనం నిర్మాణానికి స్థలం కేటాయించారు.

ఎస్‌డీఎఫ్ కింద రూ.50 లక్షలు మంజూరు

కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ.50 లక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో 2023 సెప్టెంబర్ 8న భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిధులున్నంత వరకు పనులు చేపట్టాడు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ నిర్మాణంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అదనపు నిధులు మంజూరు కాకపోవడం, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడం, ఆపై ఎన్నికలు రావడంతో భవన నిర్మాణం అసంపూర్తిగానే మిగిలిపోయింది.

ఎంపీ ల్యాడ్స్ మంజూరు

కడ్తాల మండల పరిషత్ అసంపూర్తి భవన నిర్మాణ పనులకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించారు. నిధుల మంజూరుకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యి నెలలు గడుస్తున్నా నేటికీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. పనులు ప్రారంభించడం లేదు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి ఈ విషయంలో చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రూ.కోటి నిధులు అవసరం

మండల పరిషత్ కార్యాలయ అసంపూర్తి పనులకు మరో రూ.కోటి అవసరముందని అధికారులు పేర్కొంటున్నారు. జీ ప్లస్ వన్ భవన నిర్మాణానికి ప్రతిపాదించగా, దీనికి చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. అదనపు నిధుల మంజూరు గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అదనపు నిధులు మంజూరు చేయాలి



అసంపూర్తిగా ఉన్న కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి. నిధుల మంజూరు విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఉన్నత స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలి. మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనం లేక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- దోనాదుల మహేశ్, కడ్తాల్

రెండు వారాల్లో పనులు ప్రారంభం



కడ్తాల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనుల పూర్తికి చర్యలు చేపట్టాం. ఎంపీ డాక్టర్ మల్లు రవి నిధుల నుంచి రూ.50 లక్షలు అసంపూర్తి పనులకు కేటాయించడం జరిగింది. టెండర్ల ప్రక్రియ సైతం చేపట్టాం. మరో రెండు వారాల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం.

-దార్ల పరమేశ్, ఏఈ,కడ్తాల్

భవన నిర్మాణం త్వరలో పూర్తి ...



అసంపూర్తిగా ఉన్న మండల పరిషత్ భవననిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. అదనపు నిధుల గురించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయాం. ఎంపీ మల్లు రవి నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. టెండర్లు పూర్తికాగానే పనులు చేపడుతాం.

- గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ, కడ్తాల్

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఆమనగల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఏడీఈ సీహెచ్.బాలకృష్ణ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల సదస్సు కొనసాగుతుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల విద్యుత్ వినియోగదారులు సదస్సుకు హాజరై విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయం, ఓల్టేజి హెచ్చుతగ్గు సమస్యలు, సరఫరాలో ఉత్పన్నం అవుతున్న ఇతర సమస్యలు, విద్యుత్ మీటర్ సమస్యలు, కొత్త సర్వీస్‌ల మంజూరు, బిల్లులో లోపాలు తదితర సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు హాజరై సభను విజయవంతం చేయాలని ఏఈలు శంకర్‌నాయక్, నరేందర్ కోరారు.



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఘనంగా బీరప్ప బోనాలు

తాండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలోని బీరప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం ఆదివారం దేవాలయ కమిటీ, కురుమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల వాయిద్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ నిర్మాణానికి సహకరించిన కురుమ సంఘం ప్రతినిధులను ఈ సందర్భంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు పూజారి పాండు, న్యాయవాది గోపాల్, మహిపాల్, హన్మయ్య, నాగారం జగదీశ్వర్ పాల్గొన్నారు.

మరమ్మతులు చేసిన ఐదారు రోజులకే...

- కూరుకుపోయిన మ్యాన్‌హోల్
- పనుల్లో నాణ్యత లోపం వల్లే ఇబ్బందులు
- ఇప్పటికైనా మెరుగ్గా చేయాలంటున్న ప్రజలు



బస్టాండులో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

శంషాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ బస్టాండులో మ్యాన్‌హోల్ ఆదివారం మళ్లీ కూరుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అడ్డకులు ఏర్పడుతున్నాయి. వారం రోజుల క్రింతం తెరుచుకున్న మ్యాన్‌హోల్‌పై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడంతో ఆర్టీసీ సిబ్బంది స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించారు. అయితే పనుల్లో నాణ్యత లోపించడంతో కొన్ని రోజులకే మ్యాన్‌హోల్ మరలా కూరుకుపోయింది. దీంతో ఆదివారం మరోసారి మరమ్మతులు చేపట్టారు. ఈ సారైనా నాణ్యతగా పనులు చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు, పట్టణవాసులు కోరుతున్నారు.



లక్ష్మీవేంకటేశ్వరాలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

లక్ష్మీవేంకటేశ్వరాలయంలో సత్యనారాయణ వ్రతాలు

చేవెళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని చేవెళ్ల పరిధి అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం చేవెళ్లలో గల లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు, పూజారి కన్న, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



అన్నోజిగూడలో కురుస్తున్న వర్షం

ఘట్‌కేసర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్, పోచారం, మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 7.20 గంటల నుంచి 7.50గంటల వరకు దంచికొట్టిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడ, ఘనాపూర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, పోచారం, సంస్కృతి టౌన్‌షిప్, జోడిమెట్ల, నారపల్లి, యంనంపేట్, ఇస్మాయిల్‌కాన్‌గూడ, చౌదరిగూడలలో వర్షం తీవ్రత అధికంగా ఉంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షంతోపాటు ఈదురుగాలి వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరికోతలు జోరందుకుంటున్న తరుణంలో తరచూ వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

సదర్ కదర్‌ను పెంచాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దున్నలతో ఎమ్మెల్యే శంకర్, యాదవ మహాసభ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యాదవులు నిర్వహించే సదర్ ఉత్సవం కదర్‌ను పెంచాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. దున్నల విన్యాసాలను తిలకించారు. పార్టీలకు అతీతంగా అందరూ సదర్‌లో పాల్గొనాలని కోరారు. అలాగే కేశంపేట చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ నిర్వహించగా, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవియాదవ్, స్థానిక నాయకులు వై.యాదయ్య యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, షాబాద్ మల్లేష్‌యాదవ్, నడికూడ రఘునాథ్, బాల్‌రాజ్, యాదగిరి, పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తహీనతపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న సేవా భారతి ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుమలత

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

● సేవా భారతి ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమలత

మంచాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):రోజూ పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను అధిగమించొచ్చని సేవా భారతి ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డా.సుమలత తెలిపారు. సేవాభారతి ఆధ్వర్యంలో ఆదివారం రక్తహీనతపై మండల పరిధి రంగాపూర్‌లో 11-16 సంవత్సరాల వయసు గల కిషోర బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం కోటివిటి సంస్థ ఆర్థిక సహకారంతో బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాభారతి రాష్ట్ర కార్యసమితి సభ్యురాలు అనురాధ, మహేష్, రమణాచారి, వివేక్, కల్పన, కరుణ, అండాలు, స్వప్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు నూకం రాజు, పాల్గొన్న సీనియర్ నాయకులు

మంచాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బుగ్గజాతర జాతర ఉత్సవాల రూపకల్పనలో ప్రొటోకాల్ పాటించని ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూకం రాజు డిమాండ్ చేశారు. ఆదివారం మంచాలలో పార్టీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, మారమోని శ్రీశైలం, పాండాల జంగయ్య, చివరాల పాండు, రాజేందర్‌రెడ్డి, ప్రకాష్‌గుప్తాలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బుగ్గ జాతరకు సంబంధించి ఆహ్వాన వాల్‌పోస్టర్లలో స్థానిక ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి ఫొటోను ముద్రించలేదని చెప్పారు. ఈ ఉత్సవాలను అధికార పార్టీ కార్యక్రమంగా మార్చివేశారని ఆరోపించారు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఒక చట్టసభ సభ్యుడి ఫొటోను ముద్రించకపోవడం తీవ్ర ప్రొటోకాల్ ఉల్లంఘన అని, ఇది అధికారులు, కాంగ్రెస్ నేతల కుట్ర అన్నారు.

నేడు కొనుగోలు కేంద్రాల ప్రారంభం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఉదయం 7.30గంటలకు వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే శంకర్ ప్రారంభిస్తారని సొసైటీ చైర్మన్ దారమోని బక్కన్నయాదవ్ ఆదివారం పేర్కొన్నారు. నాణ్యమైన ఎ-రకం వడ్లు క్వింటాలుకు 2,389 రూపాయలు, సాధారణ రకానికి 2,369 కొనుగోలు చేస్తామని తెలిపారు. నాణ్యమైన మక్కలు క్వింటాలు రూ.2,400 మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు చేస్తామని ఆయన వివరించారు. రైతులు నాణ్యమైన వడ్లు, మక్కలు తెచ్చి మద్దతు ధర పొందాలని ఆయన కోరారు. రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ కాపీలతో పాటు ఏఈవోల నుంచి పంట ధ్రువీకరణ పంత్రాలను తెచ్చుకోవాలని బక్కన్న యాదవ్ వివరించారు.

తక్కళ్లపల్లి బ్రిడ్జికి పొంచి ఉన్న ముప్పు


తక్కళ్లపల్లి గేటు వద్ద కూలిన బ్రిడ్జి ప్రహరీ

● రెండు వైపులా కూలుతున్న రెయిలింగ్
● బ్రిడ్జిపై పెరుగుతున్న వాహనాల రద్దీ
● పట్టించుకోని ఆర్అండ్‌బీ శాఖ

యాచారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి గేటు వద్ద సాగర్-హైదరాబాద్ రహదారిపై ఉన్న బ్రిడ్జి ప్రహరీ కూలిపోతోంది. బ్రిడ్జి ఇరు పక్కలా రెయిలింగ్ శిథిలావస్థకు చేరింది. ప్రహరీ కూలుతున్న విషయాన్ని రోడ్లు భవనాల శాఖ అధికారులు చూస్తున్నా మరమ్మతులు చేయించడం లేదు. ఈ బ్రిడ్జిపై నుంచి నాగార్జునసాగర్, ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల ప్రాంతానికి రోజూ వందలాది వాహనాలు వెళ్తుంటాయి. బ్రిడ్జిని 1999లో నిర్మించారు. బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి రోజురోజుకూ బలహీనంగా మారుతోందని, పెరిగిన వాహనాల రద్దీని తట్టుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పనులు నాసిరకంగా, బ్రిడ్జిని ఇరుకుగా నిర్మించారని అంటున్నారు. బ్రిడ్జి రెయిలింగ్ కూలుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా వాటర్ పైప్‌లైన్ పక్క నుంచి మరో బ్రిడ్జి నిర్మించాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సంబంధిత శాఖల అధికారులు బ్రిడ్జికి వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జి పక్క నుంచి వేసిన కృష్ణా వాటర్ మెయిన్ పైప్‌లైన్

ఉప ఎన్నికలో విపక్షాలకు చావుదెబ్బ తప్పదు

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుంటే, విపక్షాలు అడుగడుగునా అడ్డు పడే ప్రయత్నాలు చేస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రగతి నిరోధకంగా మారిన బీజేపీ, బీఆర్ఎస్‌లకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. పోటీలో వారికి చావు దెబ్బ తప్పదని జోస్యం చెప్పారు. ఆమనగల్లు, కడ్తాల, మాడుగుల, తలకొండపల్లి, కల్వకుర్తి, వెల్దండ మండలాల నాయకులతో ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ యూసుఫ్‌గూడలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రగతిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విషప్రచారానికి ఒడిగట్టాయని మండిపడ్డారు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రగతి ఏమీ లేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రజా వ్యతిరేకతను గ్రహించిన బీఆర్ఎస్, బీజేపీల నాయకులు కుట్ర రాజకీయాలకు తెరలేపారన్నారు. బీజేపీఏతర పాలిత రాష్ట్రాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రజలు కోరుకున్న విధంగా హైదరాబాద్ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎవరికి ఓటు వేస్తే తమకు మేలు జరుగుతుందో ప్రజలే గుర్తించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున జూబ్లీహిల్స్‌లోనూ కాంగ్రెస్ గెలిస్తే ప్రజలు ఆశించిన అభివృద్ధి జరుగుతుందన్నారు. అంతకు ముందు కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, మానయ్య, బిచ్యానాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు జి.కేశవులు, కాసు శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, మండ్లి రాములు, పర్వతరెడ్డి, మోతీలాల్, శ్రీకాంత్ రెడ్డి, జహంగీర్ అలీ, వెంకటేశ్, షాబుద్దీన్, ప్రసాద్, రమేశ్, శ్రీను, మైసయ్య, జె.సురేశ్, వెంకటేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, కొండల్‌రెడ్డి, జగన్, ఇమ్రాన్ బాబ, శేఖర్‌గౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు

భక్తుల సౌకర్యార్థం బోరు మోటార్ వితరణ


బోరు మోటార్ బిగిస్తున్న దాత పవన్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులు

కేశంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధవళగిరి గుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కేశంపేటకు చెందిన బీజేపీ నాయకుడు తలసాని పవన్‌కుమార్‌రెడ్డి బోరు మోటార్‌ను వితరణగా ఇచ్చారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి బోరుకు మోటార్ బిగించారు. కార్తీక మాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు నీటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బోరు మోటారును బిగించినట్టు తెలిపారు. అలాగే సంక్రాంతి వరకు అయ్యప్ప మాలధారులు ఆలయ ప్రాంగణంలో ఉంటూ దీక్షలు, పూజలు చేస్తారన్నారు. వారు స్నానాలు ఆచరించేందుకు, అన్నప్రసాద వంటకు నీటి ఇబ్బందులు తీరుతాయని తెలిపారు. స్వాముల, భక్తుల ఇక్క ట్లు తీర్చేందుకు బోరు మోటార్‌ను ఇప్పించానని ఆయన వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు దామోదర్‌రెడ్డి, కె.శ్రీకాంత్‌రెడ్డి, తలసాని రమణారెడ్డి, నక్క గోపాల్‌యాదవ్, పాండుగౌడ్, అమ్రేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారం


ఎన్నికల ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బైపోల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీతకు మద్దతుగా మండల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి ఇన్‌చార్జీగా ఉన్న సంజీవ్‌గాంధీనగర్‌లో పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో ఆయనతో పాటు తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండలాధ్యక్షుడు జగన్ రెడ్డి, మామిడి యాదయ్యగౌడ్, లెంకపోతుల కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో పడకేసిన పారిశుధ్యం

● పట్టించుకోని అధికారులు.. దుర్వాసనతో ప్రజల ఇక్కట్లు


ఎస్సీ కాలనీ మురుగు కాలువలో పేరుకున్న పూడిక

మాడ్గుల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లచెర్వు గ్రామంలో రోడ్లకు ఇరువైపులా కొన్ని రోజుల క్రితం డోజర్‌తో పంచాయతీ కార్యదర్శి శుభ్రం చేయించారు. అయితే దళిత కాలనీలో మాత్రం శుభ్రం చేయలేదని స్థానికులు చెబుతున్నారు. ఆంధ్రం నుంచి పత్తి తీతకు వచ్చిన కూలీలు రోడ్ల పక్కనే బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తున్నారని, దీంతో కాలనీలో దుర్వాసన వస్తోందని ప్రజలు అంటున్నారు. ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయని, ఇళ్లలో ఉండలేకపోతున్నామని వాపోయారు. ఆదివారం దళిత సంఘ నాయకులు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు ఎస్సీ కాలనీలో రోజూ రోడ్లను ఊడ్వడం లేదని ఆరోపించారు. పారిశుధ్య నిర్వహణ లేక ఎస్సీ కాలనీల్లో దుర్గంధం నెలకొందని తెలిపారు. మోరీల్లో పేరుకున్న పూడికను సైతం తీయించడం లేదని, దీంతో మురుగునీరు రోడ్లపై పారుతోందని చెప్పారు. గ్రామంలోని ఇతర వాడల నుంచి వచ్చే మురుగంతా ఎస్సీ కాలనీల నుంచే పారుతోందని.. అలాంటపుడు ఇక్కడ పారిశుధ్య నిర్వహణ లేకుంటే ఎలా అని పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా మండల, గ్రామ అధికారులు మురుగు తొలగింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పలు ఫీడర్లకు విద్యుత్ సరఫరా బంద్

కందుకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు(సోమవారం) పలు ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లో-వోల్టేజీ, బిల్లుల్లో హెచ్చుతగ్గులు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, మీటర్లపై పేర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చన్నారు. కందుకూరు, మహేశ్వరం, పహాడీషరీఫ్, బాలాపూర్ మండలాల వినియోగదారులు తుక్కుగూడ డివిజన్ కార్యాలయానికి హాజరుకావాలని తెలిపారు.

ప్రకటన

సూర్య వార్తాపత్రికలో 25.10.2025న వచ్చిన రాజశేఖర్ స్టేట్‌మెంట్ అబద్ధమైనది మరియు తప్పు మరియు రాజశేఖర్ అందించిన తప్పుడు సమాచారం ఆధారంగా మాత్రమే దీనిని ప్రచురించడం జరిగినది.

ఈ కేసు యొక్క వాస్తవమైన నిజాలు ఏమిటంటే, మొగిలిగిద్ద గ్రామం వద్ద సర్వే నం.212లోని మొత్తం భూమి విస్తీర్ణం ఎ.6-05 గుంటల, మరియు దీనికి ఒకరు స్వర్గీయ కిషన్ రావు పట్టాదారుగా ఉండగా, మరియు ఇంకొకరు రాగపురం బుచ్చయ్య రక్షిత కౌలుదారుగా ఉన్నారు. ప్రభుత్వం షాద్‌నగర్ నుండి పరిగి రోడ్డును ఎ.1-02 గుంటల విస్తీర్ణంలో వేసినందున, ఎ.5-03 గుంటలు మాత్రమే మిగిలి ఉన్నవి మరియు దానికి స్వర్గీయ రాగపురం బుచ్చయ్య రక్షిత కౌలుదారుగా కొనసాగారు. రాగపురం బుచ్చయ్య మరణం తరువాత, అతని ముగ్గురు కుమారులు స్వర్గీయ రాగపురం నర్సయ్య, ఆర్.పాపయ్య మరియు ఆర్.చంద్రశేఖర్ పైన పేర్కొన్న ఎ.5-03 గుంటలకు పిటి హక్కులను పొందారు.అయితే, పట్టాదారు మరియు పైన పేర్కొన్న రక్షిత కౌలుదారుల మధ్యన తహశీల్దార్ సమక్షంలో ఫైల్ నం. బి/6165/1976లో రాజీ కుదిరినది మరియు తహశీల్దార్ నమోదు చేసిన సదరు రాజీ ప్రకారం, భూస్వామి ఎ.3-03 గుంటల విస్తీర్ణ యాజమాన్య హక్కులను బదిలీ చేశారు మరియు రక్షిత కౌలుదారులు ఎ.2-00 మేరకు విస్తీర్ణ తమ పిటి హక్కులను భూస్వామికి అనుకూలంగా అప్పగించారు మరియు ప్రభుత్వం సదరు ఎ.2-00ను సేకరించి పశువైద్యశాల నిర్మించినది. పైన పేర్కొన్న రాజీ ప్రకారం, షాద్‌నగర్ తహశీల్దార్ పైన పేర్కొన్న రక్షిత కౌలుదారులకు ఎ.3-03 గుంటల విస్తీర్ణంలో పైన పేర్కొన్న పిటి భూమి యొక్క భౌతిక స్వాధీనాన్ని అప్పగించాలని ఆదేశించారు.తదనుగుణంగా, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పంచనామా నిర్వహించి, ఎ.3-03 గుంటలను భౌతికంగా అప్పగించారు. అందువలన, ప్రస్తుతం ఎ.6-05 గుంటల మొత్తంలో సర్వే నం.212లో విస్తీర్ణం ఎ.1-02 గుంటలు PWD రోడ్, ఎ.2-00 వెటర్నరీ హాస్పిటల్ మరియు మిగిలిన ఎ.3-03 గుంటలు రక్షిత కౌలుదారుల ఆధీనంలో ఉన్నది. పిడబ్ల్యుడి రోడ్డుకు రెండు వైపులా గల ఎ.3-03 గుంటల విస్తీర్ణంలో ఉన్న రక్షిత కౌలుదారుల భూమి ఉన్నది, ఎ.1-37 గుంటల విస్తీర్ణంలో రోడ్డుకు ఉత్తరం వైపు పశువుల దవాఖాన మరియు ఎ.1-06 గుంటల విస్తీర్ణంలో రోడ్డుకు దక్షిణం వైపు ఉన్నది. అందువలన, సర్వే నం.212లో ఎలాంటి ఖాళీ భూమి మిగిలి లేదు. అయితే, సర్వే నం.212లోని పై భూమికి పట్టాదారుగా చెప్పుకుంటూ శ్రీనివాస్ రావు అనే వ్యక్తి సుబ్బారావు అనే వ్యక్తి పేరున ఎ.0-20 గుంటల విక్రయ దస్తావేజును అమలు చేసినట్లు మరియు సుదర్శన్ రెడ్డి పేరున ఎ.0-20 గుంటలు ఉన్నట్లు రాసారని చెప్పబడినది. వాస్తవానికి, సదరు శ్రీనివాస్ రావు పైనే పేర్కొన్న భూమికి భూస్వామి లేదా పిటి కాదు మరియు పైన పేర్కొన్న భూమికి సంబంధించి అతనికి ఎటువంటి హక్కు లేదు మరియు అయినప్పటికీ, అతను పైన పేర్కొన్న విక్రయ దస్తావేజులను ఎ.1-00 విస్తీర్ణం ఎటువంటి భౌతిక స్వాధీనం లేకుండా అమలు చేశాడు. అయితే, శ్రీనివాసరావు 0-20 గుంటల భూమిని సుబ్బారావుకు విక్రయించారని, ఆయన మరణించిన తరువాత 0-20 గుంటలను భార్య వై.కోటేశ్వరమ్మ పేరుతో తన పేరు మీద బదిలీ చేశారని, ఆ రాజశేఖర్ అతని నుండి 0-20 గుంటలను కొనుగోలు చేసినట్లు చెప్పబడినది. వాస్తవానికి, సర్వే నం.212లో స్పాట్‌లో ఎ.1-00 భూమి అందుబాటులో లేదని, అందువలన, సుబ్బారావు, సుదర్శన్ రెడ్డిలకు అనుకూలంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పట్టాదారు శ్రీనివాసరావు విక్రయ దస్తావేజును అమలు చేయడం చట్టవిరుద్ధం మరియు ఎటువంటి హక్కును బదిలీ చేయదు. అంతేకాక, సర్వే నం.212లోని పై భూమి యొక్క స్వభావం పిటి భూమి, మరియు అద్దె చట్టం, 1950 లోని సెక్షన్ 38 ప్రకారం పిటి భూమిని అన్యాక్రాంతం చేయకూడదు. తదనుగుణంగా, పైన పేర్కొన్న రక్షిత కౌలుదారులు డబ్ల్యుపి.19853/2022లో కోటేశ్వరమ్మ మరియు ఇతరుల టైటిల్‌ను సవాలు చేశారు మరియు దీనిలో వై.కోటేశ్వరమ్మను 6వ ప్రతివాదిగా చేర్చారు మరియు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం వై.కోటేశ్వరమ్మ యొక్క 0-20 గుంటల భూమికి సంబంధించి ధరణి పాస్‌బుక్ నిర్వహణను నిలిపివేస్తూ 26.04.2022న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినది. అయితే, రాజశేఖర్ పైన పేర్కొన్న మధ్యంతర ఉత్తర్వులకు విరుద్ధంగా వై. కోటేశ్వరమ్మ నుండి సదరు 0-20 గుంటలను కొనుగోలు చేశాడని మరియు సదరు 0-20 గుంటలపై చట్టవిరుద్ధమైన దావా వేయడం ప్రారంభించారు. వాస్తవానికి, శ్రీనివాసరావు చెప్పినట్లుగా ఎ.1-00 కు సంబంధించిన అదనపు భూమి అక్కడ అందుబాటులో లేదు మరియు శ్రీనివాసరావు మరియు వై.కోటేశ్వరమ్మ కూడా చేసినట్లుగా చెప్పబడుతున్న డాక్యుమెంట్లు కాగితంపై మాత్రమే ఉన్నవి కానీ సర్వే నం.212లోని ఏ విస్తీర్ణ భూమి యొక్క భౌతిక స్వాధీనం లోన లేదు. రక్షిత కౌలుదారులు ఇప్పటికే సర్వే నం.212లో ఎ.3-03 గుంటలను పొందారు మరియు తదనుగుణంగా, వారు ఆర్.డి.ఒ. కార్యాలయం నుండి 23.07.2019 నాటి ఫైల్ నం. సి1928/2018 లో పేర్కొన్న భూమికి సంబంధించి ఎ.3.03 గుంటలు ఓనర్ సర్టిఫికెట్ పొందారు మరియు రక్షిత కౌలుదారులు డబ్ల్యుపి.11626/2024 లోని గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం నుండి షాద్‌నగర్ ఆర్.డి.ఒ. మరియు తహశీల్దార్ ఫరూక్‌నగర్ లను రెవెన్యూ రికార్డులలో రక్షిత కౌలుదారులు పేరుతో 38-ఎ ఓనర్ సర్టిఫికెట్ అమలు చేయాలని మరియు ఉన్నత న్యాయస్థానం ఆదేశాల అమలులో భాగంగా, ఇప్పటికే 38-ఎ సర్టిఫికెట్ అమలు చేయబడినది మరియు ఈ ప్రక్రియలో 0-10 గుంటల భూమిని ఆర్.పాపయ్య పేరిట మ్యుటేషన్ చేస్తున్నారు మరియు మిగిలిన 0-10 గుంటలను ఆర్.ఎన్.ఎస్ కేత రాజు, తండ్రి స్వర్గీయ ఆర్.నర్సయ్య పేరిట అమలు చేయాలని ప్రతిపాదించారు. అయితే, రాజశేఖర్ సదరు 0-20 గుంటల భూమిపై హక్కును క్లెయిమ్ చేస్తున్నారు మరియు అందులో ఇప్పటికే 0-10 గుంటలు పాపయ్య పేరు మీద అమలు చేయబడుతున్నది మరియు మిగిలిన 0.10 గుంటలను ఆర్.ఎన్.సాకేత రాజు పేరు మీద అమలు చేయాలని ప్రతిపాదించబడినది మరియు ఆ సమయంలో రాజశేఖర్ సివిల్ కోర్టు నుండి స్టేటస్-కో ఆర్డర్ పొందారని మరియు ధరణి పోర్టల్ ద్వారా చట్ట విరుద్ధంగా పట్టాదారు పాస్ బుక్ పొందారు మరియు బ్యాంకు నుండి క్రాప్ రుణం తీసుకున్నారు మరియు రెవెన్యూ అధికారులపై తప్పుడు ఆరోపణలు చేశారు. వాస్తవానికి, రాజశేఖర్ కు సర్వే నం.212 లోని భూమిలోని ఏ భాగానికి సంబంధించి ఎటువంటి హక్కు లేదా దావా ఉండదు మరియు సర్వే నం.212లోని భూమిలో ఏ విస్తీర్ణం కూడా అతని ఆధీనంలో లేదు మరియు రెవెన్యూ రికార్డులలో 38-ఎ యాజమాన్య సర్టిఫికెట్ అమలు చేయడానికి గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం నుండి ఇప్పటికే ఉత్తర్వులు పొందిన రక్షిత కౌలుదారుల పేరున కోర్టు ఆదేశాలను అమలు చేయడానికి మాత్రమే రెవెన్యూ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు, మరియు నేటికి పైన పేర్కొన్న రక్షిత కౌలుదారులు ఎ.3-03 గుంటల మేరకు పిటి భూమిని భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు.

ఎం.దామోదర్ రెడ్డి, న్యాయవాది

15-4-90, ఉస్మాన్‌షాహి, గౌలిగూడ, హైదరాబాద్, సెల్ నం.9848631300

పేదల ఆరోగ్య పరిరక్షణే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయం


వైద్య పరీక్షల రిపోర్టులు అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయం అని టాస్క్ సీఈవో, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఫౌండేషన్ ద్వారా లక్ష మందికి ఉచిత డయాగ్నస్టిక్ పరీక్షలు నిర్వహించి సకాలంలో వ్యాధి నిర్ధారణ ద్వారా వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్లికట్టలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. సుంకిరెడ్డి ఆరోగ్య భరోసా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెగా మొబైల్ వైద్య శిబిరాన్ని రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎల్లికట్టతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 239 మందికి వివిధ రకాల డయాగ్నస్టిక్ పరీక్షలు నిర్వహించి వైద్య సూచనలు చేశారు. న్యూట్రిన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి ఐక్యత ఫౌండేషన్ లక్ష్యాలన్నారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే 10వేల మందికి కంటి వైద్య పరీక్షలు చేయించామని చెప్పారు. దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్‌తో పాటు కళ్లద్దాలు ఇస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు వృత్తి, నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్య సేవలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సామాజిక సేవల్లో ప్రతీ ఒక్కరు పోటీ పడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగయ్య, బంగారయ్య, మధు, కృష్ణయ్య, మల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కేశవులు, రవి, నంద్యానాయక్, శ్రీరాములు పాల్గొన్నారు.


ప్రజలకు ఆర్గానిక్ కిట్లను అందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

అడుగడుగునా అడ్డంకులు

(5వ పేజీ తరువాయి)

జోక్యంతో పనులు మొదట్లోనే నిలిచాయి. మార్కింగ్ ఇచ్చిన మేరకు ఇరువైపులా ఇళ్లను తొలగించాల్సి ఉంది. సింగిల్‌గా ఉన్న ఈ రోడ్డు గుంతలుపడి పాడైపోవడంతో నిత్యం దుమ్ముధూళి వస్తుండటంతో వాహనదారులు, బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఒక వాహనం వెళ్తుంటే ఎదురుగా మరొకటి వచ్చే అవకాశం ఉండటం లేదు. రోడ్డు బాగాలేక నాగన్‌పల్లి, పోల్కంపల్లి వెళ్లేవారు చుట్టూ తిరిగి రాయపోల్ రోడ్డు నుంచి వెళ్తున్నారు. ఇక్కడి చౌరస్తా నుంచి సీహెచ్‌సీ వరకు ప్రతీ బుధవారం సంత జరుగుతుంది. వందలాది మంది కూరగాయలు, వస్తు కొనుగోలు చేసేందుకు వస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ రహదారి పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

పోల్స్ షిఫ్టింగ్‌కు రూ.10కోట్ల ఖర్చు

ఇబ్రహీంపట్నం టౌన్‌తో పాటు ఆక్టోపస్ వరకు వరుసగా ఉన్న విద్యుత్‌పోల్స్ షిఫ్టింగ్ పెద్ద సవాల్‌గా మారింది. సుమారు రూ.10 కోట్లు ఖర్చవుతుందని విద్యుత్ శాఖ అధికారులు ఎస్టిమేషన్ వేసి ఆర్అండ్‌బీకి నోటీసులు ఇచ్చారు. ఈ నిధులు విద్యుత్ శాఖకు జమ చేస్తేనే పనులు ముందుకు సాగనున్నాయి. అంతేగాక కృష్ణా నీటి సరఫరా పైపులైన్ల ఎయిర్ వాల్వ్ చాంబర్లను కూడా మార్చాల్సి ఉంది. రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు ఉన్నాయి. వీటిని తొలగించేందుకు అటవీ శాఖ అనుమతి కూడా ఇవ్వాల్సి ఉంది.


తొలగించాల్సిన విద్యుత్ స్తంభాలు

టీజీఐఐసీ రోడ్డు ద్వారా ...

ఇబ్రహీంపట్నం చెరువు కట్ట నుంచి ఉత్తరం వైపున టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు వరకు టీజీఐఐసీ కొత్త రోడ్డు నిర్మాణం చేసింది. టౌన్ నుంచి రోడ్డు పాడైనందున ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్‌కు వెళ్లే వాహనాలు బైపాస్ గుండా నాగన్‌పల్లి రోడ్డు వరకు అభివృద్ధి చేసిన ఈ దారి నుంచి వెళ్తున్నాయి. ఇక అక్కడ నుంచి గుంతలుగా ఉన్న సింగిల్ రోడ్డుపై మరో రెండు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఏదైనా అత్యవసరమైనప్పుడు ఎన్ఎస్‌జీ కమెండోలు, ఆక్టోపస్ జవాన్లకు సంబంధించిన వాహనాలు త్వరితగతిన ఘటనా స్థలికి చేరుకోకుండా రోడ్డు ఇరుకుగా ఇబ్బందికరంగా ఉంది. అంతేగాక సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు ఇదే దారిలో వెళ్లాలి. వినోబానగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం కూడా సిద్ధమైనందున ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నడుస్తున్న ఈ కళాశాలను షిఫ్ట్ చేయనున్నారు. నాగన్‌పల్లి, పోల్కంపల్లి, నెర్రెపల్లిల గుండా విజయవాడ జాతీయ రహదారికి ఇది లింకు రోడ్డు కూడా. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ రోడ్డు అభివృద్ధిలోకి రానుంది.

బస్తీవాసులను ఒప్పించాలి



ప్రాధాన్యత కలిగి ఇబ్రహీంపట్నం టౌన్ చౌరస్తా నుంచి వెళ్తున్న రోడ్డును త్వరితగతిన విస్తరించాలి. ఈ రోడ్డు పూర్తిగా పాడై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణకు బస్తీ వాసులను ఒప్పించి త్వరితగతిన పనులు చేపట్టాలి.

- కావలి వెంకటేష్, పోల్కంపల్లి

ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ చేయూత


వెంకటేశ్ సమకూర్చిన కన్‌స్ట్రక్షన్ మెటీరియల్‌ను అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, నవంబరు2(ఆంధ్రజ్యోతి):తలకొండపల్లికి చెందిన ఎల్లయ్య ఇంటి నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనిచ్చారు. నిలిచిన ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందించాలని అభ్యర్థించారు. దీంతో ఉప్పల చారిటబల్ ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ సమకూర్చిన నిర్మాణ మెటీరియల్‌ను ఆదివారం ట్రస్ట్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితజోతయ్య, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఇమ్రాన్, విండో డైరెక్టర్ యాదయ్య, శేఖర్, నాయకులు ఈశ్వర్, దశరథ్, రవి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

కేశంపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై సోమవారం ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు కేశంపేట ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్ ఆదివారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, తమ విద్యుత్ సమస్యలు బిల్లులో తేడాలు, మీటర్ పనిచేయకపోవడం, సప్లయ్‌లో లోపాలుంటే కొత్తూరులోని ఏడీఈ కార్యలయంలో దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

షాబాద్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పేకాట స్థావరంపై దాడిచేసి నగదును స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని కుమ్మరిగూడలో సోమవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కుమ్మరిగూడలో కుమార్, శేఖర్, కృష్ణ, మల్లయ్యలు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.13,600 స్వాధీనం చేసుకున్నామని, మరి కొందరు పారిపోయారని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. అందరిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పలుచోట్ల మేకల అపహరణ

కొందుర్గు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దుండగులు మేకలను అపహరించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరంగాపూర్‌నకు చెందిన మల్లేష్ తన పొలం వద్ద ఎప్పటిలాగానే షెడ్‌లో మేకలను తోలి ఇంటికి వెళ్లాడు. ఉదయమొచ్చి చూసే సరికి 15 మేకలు, అయోధ్యాపూర్ తండాలో రాజు ఇంటి ముందు కట్టేసిన మరో రెండు మేకలను సైతం దుండగులు ఎత్తుకపోయినట్టు గుర్తించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు.